# త్యాగి

## శ్రీమతి గుడిపాటి వెంకటసుబ్బమ్మగారు

రాజమండ్రీ గోదావరొడ్డున ఒక బ్రాహ్మణగృహము. వీధివేపున ఎత్తయిన అరుగులూ, వెనకవేపు విశాలమైనదొడ్డీ, దొడ్లో వృక్షాలూ అవీవుండి చల్లగావుంటుంది. దొడ్లో ఒక నుయ్యికూడావుంది. మొత్తం మీద యింటివైఖరిచూస్తే పురాతనంనాదిరీ కట్టడమని వీధిలోకే తెలిసిపోతుంది. ఒకనాటి సాయంకాలం వారిదొడ్లో యిద్దరుబాలికలు ఆడుకుంటున్నారు. వారు చాలాసేపటినుంచి పరుగెత్తి ఆడుకొంటున్నట్లుగా అలిసిపోయినవారి మొఖాల్లో కనిపిస్తోంది. కొంతసేపటిలోనే వారు ఆటమానించి నూతిదగ్గరకొచ్చి నీళ్లు తోడుకునితాగారు. ఎత్తుగాకట్టిన నూతిఅంచున ఆనుకునినుంచున్నారు ఆయాసంతీర్చుకొంటూ. ఒకటి రెండు నిమిషాల్లో ఒకమ్మాయిఅంది 'శారదా యింక నేను యింటికివెడతానే. మాఅమ్మ యివ్వాళ చాలాపనిలో వుంది. మాతమ్ముడిని ఎత్తుకోకపోతే కోప్పడుతుందికూడాను. త్వరగా రమ్మంది' అని లలిత అనగానే 'ఓహో! మీఅత్తారు వస్తారుటకదూ శ్రావణపట్టీతీసుకుని. శ్రావణపట్టీలో ఏమినగ తెస్తారే' అంది శారద. 'పెళ్లికి చంద్రహారంపెట్టారుకదూ. యిప్పుడు వడ్డాణం చేయిస్తారట. పైగా మూడువందల తులాల వెండి కొన్నారుట మా మామగారు. నాకోసం పూజసామానులు చేయిస్తారుట. మా అత్తగారు, మామగారు చాలా మంచివారుటే. మాఅమ్మ వాళ్లు చెప్పుకుంటూంటే విన్నాను' అంది లలిత. 'అవును. పైగా వాళ్ళకి వేరేఆడపిల్లలు లేరేమో. ఏముచ్చటచేసినా నీకేగా' అని శారద అంది. ఈవిధంగా ఏవో చెప్పుకుంటూ వెళ్లిపోయారు.

శారదకి యిద్దరు అన్నలు. ఒకనికి 20 యేళ్లు, యింకొకనికి 18 యేళ్లూను. ఆ తరువాత యెనిమిదేళ్ళకి శారదపుట్టింది. యిప్పుడామెకి 10 వ సంవత్సరం. ఒకనాడు శారదయింట్లో భోజనాలసమయం. ఆనాడెందుకో గాని శారద మేనమామకూడా ఉన్నాడు. అందరూ భోజనాలుచేస్తున్నారు. ఆమాటా యీమాటా చెప్పుకోడంలో శారదతల్లి భర్తతోఅంది. 'ఇప్పటికిమన అమ్మాయికి సంబంధం కుదర్చలేకపోయారు. చూడండి వాళ్ళ లలితకి శ్రావణపట్టీ తీసుకొచ్చారు. అత్తారుతెచ్చిన పట్టుచీరకట్టుకొని పూజచేసుకుంటోంటే చూడ ముచ్చటేసింది. వెండి సజ్జనిండా పువ్వులుపోసి పూజసామానులతో సహా అందించింది అత్తగారు. మామగారు దగ్గిరకూచుని పూజచేయించారు. యిదంతాచూస్తే లలిత అదృష్టవంతురాలనిపించింది' అంది. 'సరే ఏంచెయ్యమంటావు నేనుమాత్రం వూరుకున్నానా. అయిదెకరాల భూమియిచ్చి అయిదువేల కట్నంకూడా యిస్తానని తిరుగుతున్నాను. ఇంతకీ భగవంతుడుకూడా సాయంచెయ్యాలికద. మనమ్మాయెక్కడికి వెళ్లవలసుందో; ఆమొగుడెక్కడినుంచి దిగిరావాలో ఎవరికితెలుసు. ఖంగారుపడి ఏంలాభం. పోనీ, అంటే గట్టిగా కూడా అనుకోకూడదు. శారదాబిల్లొకటి వచ్చిందికదూ. పద్నాలుగేళ్లు వచ్చిందాకా పెళ్లిచెయ్య కూడదుట' అన్నాడు శారదతండ్రి. 'ఈ చట్టాలకేమిలెండి. అందరూ చెయ్యటంలేదా? మనము అల్లాగే చేద్దాము' అందితల్లి. శారద మేనమామ సుందర్రామయ్య కలగచేసుకుని 'అక్కయ్యా నువ్వేమనుకుంటున్నావో గాని పట్టుకున్నారంటే జుల్మానా వెయ్యడమేకాకుండా ఖైదులోకూడా పెడతారు. చట్టముంటే మాటలు కాదమ్మా' అన్నాడు. 'అసలు మనశారదను చదువుచెప్పించి పెద్దదయాక దానికి చూపించి నచ్చిన మొగుడుకిచ్చి వివాహంచెయ్యడం మంచిదన్నాడు' పెద్దన్న రామారావు. 'నిజమేబావా నాకూ అల్లాగే

తోస్తోంది. ఎవరిమనసు వాళ్లకి వికసించి వాళ్ళవాళ్ళ యిష్టంమీద భార్యాభర్తలు యెన్నుకుని పెళ్లిచేసుకుంటే ఆసంసారం మరీ అందంగావుంటుంది. శాస్త్రిల్లుగారి సరళమొగుడేంచేశాడో చూశారా? ఆపిల్ల నల్లగావుందనీ చదువుకోనిశుంఠనీ, తనకి తెలియనివయస్సులో అంటకట్టారనీ ఏవేవోవంకలుపెట్టి తీసికెళ్లడం మానేశాడుట. నాలుగేళ్ళనుంచి ఏడుస్తూపుట్టింటిదగ్గిర పడుంది పాపం' అని సుందర్రామయ్య బలపరిచాడు, యిటూ అటూ శారదలేదుకదా అని దిక్కులు పరికించి. 'మీలో మీరు సరిపెట్టుగోడంచూస్తే చిత్రంగా వుంది. ఎవడో ఒక తుంటరివెధవచేస్తే సరాయేమిటి. వాళ్ళశ్యామలకి యెనిమిదేళ్లపిల్లప్పుడు పెళ్ళయింది. అదిమాత్రం నల్లగ లేదూ, నిక్షేపంలాగున్నారు చిలకాగోరింకల్లా. 200 రూ. వుద్యోగంటకూడాను అతనికి' అంది తల్లి. 'ఊరుకోవమ్మా అక్కయ్య నీకు తెలియదు. శ్యామలమొగుణ్ణి నేను బాగా యెరుగుదును. రెండువందల్లోనూ యింటికితెచ్చేది ఏభయిమాత్రమే. మిగిలింది బోగమాళ్ళకి, కిల్లీలకి, సిగరెట్లకి సరిపెడతాడు. పాపం తండ్రి బాగున్నాడు కనక గుట్టుగా నడుస్తోంది సంసారం' అన్నాడు సుందర్రామయ్య. 'మళ్లీ నిజమేరా ఆలోచించగా ఆలోచించగా ప్రపంచకం అల్లాగే ఏడుస్తోంది. పెద్దవాళ్ళయాక వాళ్ళకి నచ్చిందో లేదో కనుక్కొని మరీ పెళ్లిచెయ్యడం మంచిది అనిపిస్తోంది. ఆపైన యెవరికర్మ వారిది. అజ్ఞాన దశలో పెళ్ళిచేశారని మనస్సు క్షోభించనక్కరలేదు' అన్నాడు తండ్రి. మొత్తంమీద శారదపెళ్ళి ఆపుచేసి చదువులో పెట్టడమే నిశ్చయంచేసుకున్నారు.

౨

ఆరు సంవత్సరాలతర్వాత. శారదహైస్కూలుచదువు పూర్తిచేసి కాలేజీలో ఇంటరులోచేరింది. యింతవరకు ఆమె పెళ్ళివిషయమే మరిచిపోయింది. చదువులోపడిపోయింది. బాగాచదవాలనీ, మంచిమార్కులు తెచ్చుకోవాలనీ, మేష్టర్లచేత బహూకరింపబడాలని ఎంతమటుకు ఆమెకోరిక. ఆమెక్లాసులోనే చదువుతున్నాడు ప్రభాకర్ అనే అతను. మంచి తెలివయినవాడు. వయస్సు పాతికేళ్లుంటాయి. చామనచాయ. సన్నంగా పొడుగ్గావుంటాడు. కళయినమొఖం. కళ్లల్లో సరస్వతి తాండవం ఆడుతోన్నట్టుంటుంది. శారదకూర్చునే బెంచీకి ఎదురుబెంచీమీదే తను కూర్చుంటాడు. అన్నిటిల్లోనూ యితనికి మంచిమార్కులు వస్తాయి. యితను బాగాచదవడం మంచిమార్కులు తెచ్చుకోడం చూసింది శారద. అతనితో స్నేహంచేసి లెఖలు అవీ నేర్చుకుని తనుకూడా మంచిమార్కులు తెచ్చుకోవచ్చుకదా అని ఆలోచించి ప్రభాకర్‌తో స్నేహంచెయ్యడం మొదలెట్టింది. తెలియని లెఖలు నేర్చుగోడం, అతని నోటుపుస్తకాలు అడిగితీసుకుని తెలియనివి వ్రాసుకోడం, తనపుస్తకాలు అతనికియ్యడం మొదలయినవాట్లతో వీరిస్నేహం వృద్ధిపొందింది. యీవిధంగా ఒకసంవత్సరం గడిచిపోయింది. వేసంగిశలవులు వచ్చేశాయి. —(సశేషం)

కుష్ఠు ★ బొల్లి అన్నిరకముల కుష్ఠు, బొల్లి వ్యాధులకు, ఇతర చర్మవ్యాధులకు గ్యారంటీగా పనిచేయుచున్నవి
మా ఔ ష ధ రా జ ము లే !! కేటలాగులు, యోగ్యతాపత్రములు ఉచితము!
రెడ్డి & కో.. (రిజిష్టర్డ) H. O. గోపాలపురం (వయా) తణుకు, తూ. గోదావరిజిల్లా
బ్రాం చ్ ఆ ఫీ సు లు.
నెల్లూరు ★ విజయవాడ ★ సికిందరాబాద్ ★ వాల్తేరు
కాపువీధి గాంధినగరం 3560 కింగ్స్‌వే R. S.
బరంపురం ★ కటక్ ★ ఫజిల్‌నగర్
దేశి బెహరావీధి బక్సీబజార్ గోరక్‌పూర్